క్లుప్తంగా

స్పోర్ట్స్ కిట్లు అందజేత


కిట్లు అందజేస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: మండలంలోని బొరిగిపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సోమవారం తన కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. కొద్దిరోజుల క్రితం సబ్ కలెక్టర్ పాఠశాలను సందర్శించినప్పుడు, పాఠశాలకు కిట్లు కావాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరడంతో వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు డి.తులసీరెడ్డి, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత


తక్షణ సాయం అందజేస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామానికి చెందిన కన్ను కామరాజు(48) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి చేతులమీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, ఎలుసూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు అవార్డులు


ఎస్పీ రాధిక చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావు

కాశీబుగ్గ: స్థానిక పోలీసు డివిజన్ కేంద్రంలో నేరాలను కట్టడిచేస్తూ, ఉత్తమ ప్రదర్శన కనబరుస్తున్న కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు రెండు బెస్ట్ అవార్డులు వరించాయి. జిల్లా పోలీసు అధికారి కార్యాలయంలో అర్ధవార్షిక నేర విభాగ సమావేశంలో ఎస్పీ జీఆర్ రాధిక కాశీబుగ్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గుగ్గిలాపు శ్రీనివాసరావుకు అవార్డులు సోమవారం అందజేశారు. అలాగే ఇటీవల 48 గంటల్లో ఛేదించిన డెకాయిటీ కేసుకు సంబంధించి అభినందనలు తెలిపారు.

'విజయవంతం చేయండి'


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

సోంపేట: జాతీయ దళిత ఉద్యమకారుడు కత్తి పద్మారావు 70వ జయంతి పురస్కరించుకొని ఈనెల 29వ తేదీన పొన్నూరులో నిర్వహించనున్న కుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జైభీమ్ సేన సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోంపేట పట్టణంలో పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జైభీమ్ సేన జిల్లా అధ్యక్షుడు నగిరి మోహనరావు, సంఘ ప్రతినిధులు చింత ప్రకాష్, బుష్క ఈశ్వరరావు పాల్గొన్నారు.

కల్వర్టు పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రధాన కేటీ రోడ్డుకు కలుపుకునే డిగ్రీ కళాశాల రోడ్డు కల్వర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనులను మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పూర్తిస్థాయిలో పనులు జరిగితే జంట పట్టణాలు సుందరంగా కనిపిస్తాయన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఇచ్ఛాపురం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, ఏస్‌పేట, మండపల్లి, లొద్దపుట్టి ఫీడర్ పరిధిలోని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఈఈ జి.ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సచివాలయాలు
ఆధునిక దేవాలయాలు


మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

- వలంటీర్లను కించపరిచిన వారికి ఎన్నికల్లో బుద్ధి చెప్పండి
- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- కొత్తపేటలో సచివాలయం ప్రారంభం

వజ్రపుకొత్తూరు: గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చిన సచివాలయాలు ఆధునిక దేవాలయాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని కొత్తపేటలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంబటి శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు పక్కాగా సేవలు అందిస్తుండడం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాధించిన అతి పెద్ద విజయమన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను కించపరిచి మాట్లాడుతున్న వారికి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అప్పుడే పుట్టిన పిల్లాడి నుంచి పండు ముసలి వరకు సంక్షేమ పథకాలు అందించడమే ఈ ప్రభుత్వం గొప్పతనమన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి అత్యంత కృషి చేస్తున్నామని తెలియజేశారు.

ప్రభుత్వ పథకాలు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ అవుతున్నాయన్నారు. గత ప్రభుత్వాలకు ఈ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రతీ ఒక్కరూ గమనించాలని కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, ఉప తహసీల్దార్ వి.గిరిరాజ్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, క్లస్టర్ ఇన్‌చార్జులు దున్న బాలరాజు, మద్దిల హరినారాయణ, టి.వరదరాజులు, ఎస్.వెంకన్న, మాజీ సర్పంచ్ అంబటి రాజులు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు జల్లు ఉషారాణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లి జోగారావు, దాసరి దాలయ్య, సర్పంచ్‌లు ఎ.గోపి, చింత హేమారావు, చింత రాజు, టి.సుశీల, మామిడి భాస్కరరావు, వంక చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలగా జింకిభద్ర ఎంపీయూపీ పాఠశాల


ఎంపీపీ దాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని జింకిభద్ర ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు అందినట్లు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తెలిపారు. పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడంలో కృషి చేసిన ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ కార్యాలయంలో సోమవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటు కావడంతో విద్యార్థుల ఇబ్బందులు తొలగాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.వేణుగోపాలరావు, గ్రామస్తులు తామాడ చంద్రశేఖర్, అనంత్ పెద్దకోటి, ఎన్ని అజయ్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాలి'



పలాస: మాట్లాడుతున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు

పలాస: మణిపూర్ ఘటనపై అక్కడి ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు రాజీనామా చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు ఈశ్వరమ్మ, రైతు సంఘం నాయకులు మద్దిల రామారావు, లిబరేషన్ నాయకులు అప్పయ్య, పోతనపల్లి అప్పారావు, శాంతమ్మ, పార్వతి, అరుణ, సుందరమ్మ, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రగతి శీల మహిళా సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక స్త్రీశక్తి భవనంలో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐప్వా నాయకులు కోనారి ఈశ్వరమ్మ, శాంతమ్మ, పార్వతి, అరుణ, సుందరమ్మ, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే మణిపూర్‌లో మహిళను వివస్త్ర చేసిన నిందితులను ఉరితీయాలని కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘాలు నిరసన తెలిపాయి. కార్యక్రమంలో సంఘాల జిల్లా అధ్యక్షుడు గోరు వాసుదేవరావు, సీహెచ్ రవి, పవన్, మణికంఠ, వెంకటరమణ, గోపాల్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం


వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: స్పందనలో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 51 వినతులు వచ్చాయి. తమకు ఇంటి స్థలాలు అందజేయాలని టెక్కలికి చెందిన జోగి సుజాత, సోమరిపేట శ్రీనివాసరావులు కోరారు. తనకు వితంతు పింఛన్ అందజేయాలని దేవాది లక్ష్మి విన్నవించారు. తాను కొనుగోలు చేసిన భూమికి సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో ప్రభుత్వ భూమిగా చూపుతోందని, దీనిని సరిచేయాలని సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామానికి చెందిన చల్లా మహలక్ష్మి కోరారు. స్థానిక మండాపొలం కాలనీలో ఖాళీ స్థలాల వలన మురుగు సమస్య ఏర్పడుతోందని టి.వైకుంఠరావు ఫిర్యాదు చేశారు. తనకు జగనన్న కాలనీలో ఇంటి పట్టా ఇచ్చారని స్థలం చూపడం లేదని శంభాన లక్ష్మి ఫిర్యాదు చేశారు. అడంగల్, 1-బీ లో తన భూమి వివరాలు నమోదు చేయాలని హిరమండలంకు చెందిన కోనారి షణ్ముఖరావు విన్నవించారు. తనకు చెందిన భూమిని కొంత మంది తప్పుడు పత్రాలు సృష్టించి కాజేయాలని చూస్తున్నారని తలగాం గ్రామానికి చెందిన హనుమంతు జయలక్ష్మి ఫిర్యాదు చేశారు. దీంతో సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సబ్ కలెక్టర్ సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


కోటబొమ్మాళి: పెద్ద బమ్మిడిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న దువ్వాడ వాణి తదితరులు

కోటబొమ్మాళి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని పెద్దబమ్మిడి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రోణంకి మల్లయ్య, సర్పంచ్ మెండ తాత, డీటీ మధు, వెటర్నరీ ఏడీ ఎం.లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని దేవళభద్రలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

మందస: మండలంలోని కొంకదాపుట్టిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి నాగేశ్వర బృందావన్ తదితరులు పాల్గొన్నారు.


నందిగాం: దేవళభద్రలో ధ్రువపత్రాలు అందజేస్తున్న పేరాడ తిలక్


మందస: మాట్లాడుతున్న నాగేశ్వర బృందావన్

మహనీయుల త్యాగాలు మరువలేనివి


అనసూయమ్మను సన్మానిస్తున్న దృశ్యం

మందస: దేశం కోసం మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మందస బ్రాంచి మేనేజర్ కృష్ణచంద్ర పాత్రో అన్నారు. బ్రాంచ్ పరిధిలో ఉన్న స్వాతంత్య్ర సమరయోధులు, వారసులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సమరయోధులను సన్మానిస్తున్నామన్నారు. రాధాకృష్ణపురం గ్రామానికి చెందిన కొంచాటి అనసూయమ్మను దుశ్శాలువతో సన్మానించి, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో అకౌంటెంట్ సనపల మురళీకృష్ణ, జి.పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నూతన భవనం పరిశీలన

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడలో కొత్తగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతి రావు హేమసుందరరాజు తదితరులు సోమవారం పరిశీలించారు. త్వరలో ప్రారంభమవ్వనున్న భవనంలో అన్ని వసతులు కల్పించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

21 మంది విద్యార్థుల ఎంపిక

టెక్కలి: స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 21 మంది విద్యార్థులు టెక్ మహీంద్రా సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసీఈ, సీఎస్ఈ, ఈఈఈ, ఐటీ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.4 లక్షలు వేతనంగా అందజేస్తారని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌వోడీలు అభినందనలు తెలిపారు.

మండల పరిషత్ సమావేశం నేడు

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సాధారణ మండల పరిషత్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు బోర పుష్ప అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖలకు సంబంధించి అధికారులు హాజరవ్వాలని కోరారు.

'గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి'

మందస: మండలంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు సవర చంద్రరావు, సవర డొంబురు, సవర బాలకృష్ణ, నగేష్, సీతారాంలు కోరారు. ఈ మేరకు సోమవారం అధికారులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఐటీడీఏ నిధులను గిరిజనేతర గ్రామాలకు కేటాయించవద్దని, బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలోకి చేర్చవద్దని కోరారు. మండల కేంద్రమైన మందసలో గిరిజన భవనం నిర్మాణం చేపట్టాలన్నారు. భూ రీసర్వే చేయించాలని, పట్టులోగాం బాలికోన్నత ఆశ్రమ పాఠశాలకు రోడ్డు, లైట్లు వేయాలన్నారు. కొండలోగాం ఎంపీపీ స్కూల్‌కు అదనపు భవనం మంజూరు చేయాలని, రామరాయి-గోపిటూరుకు బీటీ రోడ్డు నిర్మించాలని విన్నవించారు. కుసుమల నుంచి బంసుగాం-జన్నివీధిలకు రోడ్డు నిర్మాణం చేపట్టాల కోరారు. వారితో పాటు సవర నందు, బాలకృష్ణ, సోమేశ్, అడ్డిబీరేంద్రరావు, ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

మందస: మండలంలోని భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం(బాలికలు)లో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ రఘుపాత్రుని సుభాషిణి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 5వ తరగతిలో 49 సీట్లు, 6వ తరగతిలో 44 సీట్లు, ఏడో తరగతిలో 43 సీట్లు, 8వ తరగతిలో 45 సీట్లు, 9వ తరగతిలో 42 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీకి 25 సీట్లు, బైపీసీకి 4 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కేవలం అర్హులైన ఎస్సీ విద్యార్థినులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 28వ తేదీలోపు గురుకులంలో సంప్రదించాలని కోరారు.

కంచిలి: మండల కేంద్రం కంచిలి గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో మిగులు సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 5వ తరగతిలో 55 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఎస్సీ విద్యార్థినులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- పోలేరులో గడప గడపకూ మన ప్రభుత్వం

కంచిలి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని పోలేరు సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, సర్పంచ్ బల్ల చారుమతి, బల్ల తిరుపతి, దద్ద మోహనరావు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ పుష్ప తదితరులు


పలాస: మొక్కలు నాటుతున్న గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు

పలాస: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గ్రీన్ ఆర్మీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. మండలంలోని శాసనాం గ్రామంలో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైతే మొక్కలు పెంచాలనుకుంటున్నారో వారికి మొక్కలను ఉచితంగా ఇవ్వడానికి గ్రీన్ ఆర్మీ సిద్ధంగా ఉందన్నారు. మానవ మనుగడ మొక్కలపైనే ఆధారపడి ఉందని పేర్కొన్నారు. మొక్కలను నాటడంతో పాటు సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నేషనల్ ఉత్తమ ఉపాధ్యాయుడు అస్పాన మధుబాబు, బోకర దుర్యోధన, దాసరి శ్రీనివాస్, పేడాడ మన్మధరావు, దాసరి వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. మండలంలోని కొళిగాం ఉన్నత పాఠశాల ఆవరణం, బొడ్డబడ గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్యపు కోరల నుంచి రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సంతోష్ మండలా, కారంగి త్రినాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, లోపింటి దీనబంధురెడ్డి, ఉదయ్ బోహరా, హెచ్ఎం కొత్తపల్లి వాసుదేవరావు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ లోపింటి సరోజని తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

'ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి'

కాశీబుగ్గ: పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న జీడిరైతు సైని సింహాచలం కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మాకన్నపల్లి సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ టెక్కలి రాధ, వీహెచ్‌పి ఝాన్సీలకు వినతిపత్రం సోమవారం అందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జీడి రైతుల సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, ఎం.లక్ష్మణరావు, కె.నారాయణమ్మ, కె.సింహాద్రి, కె ఈశ్వరి, కె.హేమావతి, పి.భాగ్యవతి, పి.ప్రమీల, ఎం.భారతి, వి.రేఖ తదితరులు పాల్గొన్నారు.

'సీట్లు మంజూరు చేయాలి'

టెక్కలి: పట్టణంలోని వివిధ ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు వసతి గృహంలో సీట్లు కేటాయించాలని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు టి.సూర్యం మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు వసతి గృహాల్లో సీట్లు మంజూరు విషయమై మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, స్థానికంగా ఆయా వార్డెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే దీనిపై స్పందించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి బి.రాజమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదగిరి, గోవింద్, రాము తదితరులు పాల్గొన్నారు.

'తలసేమియా పిల్లలను ఆదరిద్దాం'

ఇచ్ఛాపురం రూరల్: రక్త హీనతతతో బాధపడుతున్న తలసేమియా పిల్లలకు రక్తాన్ని దానంచేసి, వారిని ఆదరిద్దామని రోంపా యువజన సంఘ సభ్యులు పిలుపునిచ్చారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామం రోంపా బొరడాలో బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రి సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొరుగు రాష్ట్రమైన ఒడిశా బరంపురం ఎంకేసీజీలో అత్యవసర పరిస్థితుల్లో ఆంధ్రా ప్రాంతానికి చెందిన రోగులకు ఖరీదైన వైద్య సహాయం లభిస్తోందని, అదేవిధంగా తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు సైతం రక్తం లభిస్తుందన్నారు. రక్తదాన శిబిరాన్ని సంఘ సేవా కార్యకర్త తిప్పన దుర్యోధనరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మీనామృతంతో అధిక దిగుబడులు

ఇచ్ఛాపురం రూరల్: సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తే లాభదాయకంగా ఉంటుందని, ముఖ్యంగా మీనామృతం ద్రావణంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం పీఆర్పీ జాడు తులసయ్య అన్నారు. మండలంలోని పాయితారి గ్రామంలో చేపల వ్యర్థాలతో మీనామృతం ద్రావణం తయారీపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీనామృతం ద్రావణం తయారీకి 1:1 నిష్పత్తిలో చేపల వ్యర్థాలు, బెల్లం తీసుకొని రెండింటినీ ఒక కుండలో వేసుకొని రెండు పూటలా కలుపుకోవాలన్నారు. ఈవిధంగా ఈ ద్రావణం 20 రోజులకు తయారవుతుందని పేర్కొన్నారు. ఈ మిశ్రమాన్ని పిచికారీ చేయడం వల్ల పంటల ఎదుగుదలకు, దిగుబడి పెరగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ కుమారీ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కంచిలి: మండలంలోని బెల్లుపడ గ్రామానికి చెందిన ఒబినింటి దుర్యోధన(53) ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, సర్పంచ్ అయిదం జయరాం, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, స్థానిక నేతలు కృష్ణారావు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

కాశీబుగ్గ: ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలియజేస్తూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎస్జీవో కార్యాలయం ఎదురుగా సోమవారం కరపత్రాలు ఆవిష్కరించారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతి, మండల కార్యదర్శి భూదేవి పాల్గొన్నారు.